# ప్రేమ ఎంత మధురం!

పెద్దూరి వెంకటదాసు

(కిందటి సంచిక తరువాయి)

ఆమె కాపురాని కొచ్చింతర్వాత ఏ నాడు భర్త కంట నీరు చూడలేదామె.

మామగారిని గురించి గొప్పగా ఊహించుకుంది. తన అంచనాలకు అందనంత మహోన్నతమైన వ్యక్తి తనకు మామగారైనందుకు గర్వంగా ఫీలయ్యింది అనే కంటే-ఆంధ్రప్రదేశ్ పల్లెటూళ్లలో ఆణిముత్యా లుంటాయని ఆమె కప్పుడే తెలిసింది.

కోడలి పట్టుదల మేరకు మిగిలిన ఆ ఒక్క ప్రదేశం చూసి ఆ మర్నాడే ప్రయాణమయ్యారు. కోడలి అనురాగాన్ని, ఆప్యాయతని మూటగట్టుకుని సొంత ఊరికి.

ఇండియాకు తిరుగు ప్రయాణంలో మామగారికి ఎవరి తోడు అవసరం లేదని అర్థమయింది శైలజకి.

మొదట ఆమెను అదే భయం వెంటాడింది-భర్తతో వాదులాడింది కూడా, తానెళ్ళి పంపించి వస్తానని.

"నాన్నగారు జాగ్రత్త!" అంటూ ఒకటికి పదిసార్లు జాగ్రత్తలు చెబుతున్న కొడుకుని చూసి, 'ఆయనకేం తెలుసు, తండ్రి కనీస్ టాయ్‌లెట్ అని వున్న బోర్డు కూడా చదవలేడనుకుంటున్నాడు కాబోలు!' అనుకుని, లోలోపలే నవ్వుకుంది శైలజ.

000

ఊరు ఊరంతా కదిలి వచ్చింది- వెంకటాచలం-కామాక్షమ్మ దంపతులు అమెరికా నుంచి వచ్చారని. అంతే కాదు, ఎన్నో ఏళ్లుగా మాటలు లేని చెల్లెలు ప్రసూన, బావ నాగభూషణం కూడా వాళ్లతో పాటు వచ్చారు.

అదో పెద్ద వార్తయింది ఆ ఊరివారికి-

హైదరాబాద్ ఎయిర్ పోర్టుకి వచ్చి రిసీవ్ చేసుకున్న చెల్లెలు, బావ, "మీతో పాటు మేమూ ఊరికి వస్తా"మంటూ టాక్సీ మాట్లాడి బయలుదేరుతూంటే, వాళ్ల సంతోషానికి హద్దులే లేకుండాపోయా యి.

పరామర్శించడానికి వచ్చినవాళ్లందరికీ ప్రయాణం బడలికతో వున్నా, ఎంతో హుషారుగా చెప్పారక్కడ గడపిన మధురమైన అనుభవాలను. కోడలి గురించి ఎంత చెప్పినా తక్కువే అనిపించింది వారికి, ఆమె తలంపు రాగానే.


చెల్లెలి కారణంగా విడిపోయిన తమ కుటుంబం, చెల్లెలి కూతురి వల్ల మళ్లీ కలిసినందుకు ఆ కోడలికి మనసులోనే కృతజ్ఞతలు తెలుపుకున్నారు వెంకటాచలం దంపతులు.

మాట పట్టింపులకు, పట్టుదలలకు పోయి తాము కోల్పోయింది తక్కువేం కాదు అని తెలిసివచ్చింది ఆ రెండు కుటుంబాలకు.

000

హైదరాబాద్‌లో తోడబుట్టిన చెల్లెలున్నా, ఆమె భర్త గవర్నమెంటులో ఉన్నత పదవిలో ఉన్నా, ఎన్నో వ్యయప్రయాసల కోర్చి కొడుకుని హాస్టల్‌లో ఉంచి చదివించాడు తప్ప, చెల్లెలి ఇంటి కే పంపలేదు. తన భార్యని, తనని చదువురాని పల్లెటూరివారని నలు గురిలో చులకనగా చూడడం - ఆత్మాభి మానం గల వెంకటాచలానికి నచ్చేది కాదు చెల్లెలి నైజం-తన కూతుర్ని అమెరికాలో చదవిస్తున్నానని చాలా గొప్పగా ఫీలయ్యేది.

"ఏదో మీ తాహతుకు తగ్గట్టు ఈ ఊరి మండలం హై స్కూలు వరకు చదివిస్తే చాలు. మన శ్రీధర్‌ని నీకు వ్యవసాయంలో చేదోడువాదోడుగా ఉంటాడు. కాసలెక్కలు వగైరా చూసుకుంటాడు" అంటూ ఓ ఉచిత సలహా పడేసింది అన్నయ్యకు, ఎక్కడ 'మీతో పాటు పట్నం తీసుకెళ్లి చదవించ'మంటారోనని. ఆ మాట కొస్తే అతనే నాడు ఆ ప్రస్తావన తీసుకురాలేదు కూడా.



అక్కడే వెంకటాచలం అహం దెబ్బ తింది. "భర్తకు పెద్ద ఉద్యోగం, ఒక మరిది అమెరికాలో, మరో మరిది న్యూజిలాండ్‌లో, ఒక్కతే కూతురు, అదీ నేనే చదివిస్తానంటూ ఆ అమ్మాయిని పెద్ద మరిది అమెరికా తీసుకెళ్లాడు. ఒక్క కొడుకు. వాడు రేపో మాపో పై చదువుల కని బాబాయిల దగ్గర కెళ్తాడు. ఏమైనా ఆమె ఈ ఇంటి ఆడపడుచు. మన దగ్గర కాక ఎవరి దగ్గర సాగించుకుంటుంది?" అని భార్యను ఓదార్చాడు ఎన్నో సార్లు.

ఆ మాటల్లో నిజం కనిపించేది కామాక్షమ్మకు.

"అలా ఎందుకు మాట్లాడి వాళ్ల మనసుల్ని నొప్పించావు- వాణ్ని నీతో పాటు తీసుకెళ్లి చదివించమన్నారా? వాళ్లేమను కుంటారోనని కూడా ఆలోచించలేక పోయావా! నీ పద్ధతి మార్చుకో" చీవాట్లు పెట్టాడామె భర్త నాగభూషణం ఆ నాడే

అదే ఆఖరి పండగ ఆ ఊళ్లో. మళ్లీ ఇన్నాళ్లకు ఆదంపతులు ఆ ఊళ్లో అడుగుపెట్టారు-అందుకే అది వార్త అయింది.

000

అమెరికా కెళ్లాకే ఎన్నో నిజాలు తెలిశా యి వెంకటాచలానికి, హైదరాబాద్‌లో ఇంజినీరింగ్ పూర్తి చేసిన శ్రీధర్ అమెరికా వెళ్లడానికి నాగభూషణం బావ కారణ మైతే, అక్కడ వాడు పి.జి. చేసి ఉద్యోగం సంపాదించడానికి అన్నీ తానై సహకరించింది శైలజ. ఆ తండ్రీకూతుళ్లే ఆదుకోకపోతే శ్రీధర్‌కి భవిష్యత్తేది?

తనెంత అపోహ పడ్డాడు! కొడుకు "చెప్పకుండా అనుకోని పరిస్థితుల్లో పెళ్లి చేసుకున్నందుకు క్షమించండి నాన్నా!" అని లెటరు వ్రాసినప్పుడు-ఏ పరిస్థితుల్లో అలా చేయాల్సి వచ్చిందో అప్పుడర్థం కాలేదు వెంకటాచలానికి.

కానీ ఇప్పటికీ అర్థం కానిది ఒక్కటి, అదే అడగాలనుకున్నాడు నాగభూషణం బావని. భోజనాల దగ్గర కదిపాడు.

"అది సరే బావగారు, నా కిష్టం లేని పెళ్లి కాబట్టి కోపమొస్తుందేమోనని నాకు చెప్పలేదంటే అర్థముంది, కానీ మీ కూతురి పెళ్లికి మీరైనా"...

వెంకటాచలం మాట పూర్తి చేయక



ముందే నాగభూషణం అందుకున్నాడు, "చెబుతాను బావా, అదీ చెబుతాను. జరిగిందాంట్లో, ఎవరి తప్పో, ఎవరి ఒప్పో. శిక్ష కూడా అందరికి సమానంగానే. మే మెల్లి మీరు రాకపోతే బాగుండదు. అమ్మాయి. నాన్నగారు బావ, నేను ప్రేమించుకున్నామని వ్రాసిన నాడే నేను నిర్ణయించుకున్నాను. మీ చెల్లెలికి కూడా తెలియదు. పరిస్థితులన్నీ సర్దుకున్నాక చెబుదామ నుకున్నాను. అందుకే మా తమ్ముడికి పెళ్లి బాధ్యత అప్పగించాను. 'అవునయ్యా! మన అమ్మాయి అక్కడెవరి నో ప్రేమించి పెళ్లి చేసుకుందట అని మాత్రమే చెప్పాడు. కొన్ని రోజులకి, అమ్మాయి మీద కోపమున్నా, అల్లుడి దగ్గరి నుంచి ఇ-మెయిల్, నా మనస్సును శాంతపరిచింది. 'ఈ నెలలో నే మీరు రిటైరవుతున్నానన్నారుగా మామయ్యా-వెం టనే అత్తయ్యను తీసుకుని అమెరికా వచ్చేయండి' అని. పెళ్లి కెళ్లలేకపోయినా ఈ రకంగా వెళ్తున్నందుకు సంతోషడ్డాను."

గుక్క తిప్పుకోకుండా జరిగిందంతా చెప్పింది ప్రసూన. "తన అన్నయ్యతో కానీ, ఆ తర్వాత ఆ అమ్మాయి-రామచంద్రరావుగారితో, మా అమ్మానాన్నలను పర్సనల్‌గా కలిసి ఈ లెటరు ఇవ్వండి అని ఒక కవరు పంపింది. వచ్చేటప్పుడు మా అత్తమామల్ని తీసుకురమ్మందట అతనితో పాటు. ఆ లెటర్లో వివరాలన్నీ వ్రాసింది. అప్పుడు తెలిసింది నాకు, నా కూతురు పెళ్లి చేసుకుంది నా మేనల్లుడినేనని. ఇదంతా తండ్రీకూతుళ్ల కుట్ర. మనమే పరాయివాళ్లం" గారాలు పోయింది చెల్లెలు, అన్నయ్య దగ్గర, తన మనసులోని అక్కసు భర్త,మీద చూపిస్తూ.

"వదినమ్మా! ఊళ్లో వాళ్లకే చెబుతావా అమెరికా విశేషాలు, మాకేమైనా మిగిల్చావా లేదా, చెప్పడానికి?" గోముగా అంది వదినను ప్రసూన.

"ఆ! చూశానొదినా. అమెరికాలో ఓ దేవాలయం చూశాను ఆ గుడిలో ఒక దేవతను చూశాను. ఆ దేవాలయాన్ని, ఆ దేవతను వదలలేక మనసక్క డొదిలేసి కట్టెగా తిరిగొచ్చా నొదినా. ఇంత కంటే ఏం చెప్పనొదినా?"

భార్య కళ్లలో సుళ్లు తిరిగే నీటిని గమనించి, తానే చెప్పాడు వెంకటాచలం, "ఆ దేవత నీ కూతురేనమ్మా!" అని.

"అత్తయ్య, మామయ్య మీరెళ్లొద్దని వేడుకున్నా భారమైన మనసుతో తిరిగొచ్చా మమ్మా. రెక్కాడని రోజు మమ్మల్ని పువ్వుల్లో పెట్టి చూసుకునే తోడుందన్న సంతృప్తితో."

"చూశావా ప్రసూనా, బిడ్డల్ని కన్నప్పుడు కాదు తల్లిదండ్రులు కానందం. వారు పెరిగి పెద్దవారై పదిమందిలో పేరు తెచ్చుకున్నప్పుడు. అల్లుడు మనల్ని రమ్మంటే, అమ్మాయి వాళ్ల అత్తమామల్ని రమ్మం ది చూశారా! అని నీవన్నావే. అమ్మాయి దృష్టిలో ఆమె ఆలోచన కరెక్ట్. అబ్బాయి దృష్టిలో అతని ఆలోచనక కరెక్ట్. పోటీ పడి అభిమానాన్ని చాటుకోవడం తప్పు కాదుగా. అమెరికా కెళ్తే ఇంత కన్నా ఎక్కువ సంతోషపడేవాళ్లమా? ఓ అత్త, తన కోడల్ని దేవత అందంటే, ఆ కూతుర్ని కన్నందుకు, మనకు గర్వంగా లేదా? ఏ నాడు కంటతడి పెట్టని వెంకటాచలం బావ కోడలి గురించి చెబుతూ ఆనంద బాష్పాలు రాల్చాడంటే ఈ జన్మకు మనకిది చాలదా? ప్రసూనా! నేను నీకు మొదటి నుంచి చెబుతూనే ఉన్నా, మంచి మనసుతో దేన్నయినా జయించవచ్చునని. అది నీ కూతురు నిరూపించింది. అక్కయ్య ఆ మాట నిజం చేసింది. ఎందుకంటే కోడలెంత బాగా చూసినా, ఆ, వాడలా పైకి కోపం కనబరుస్తాడే కానీ వాడు చెప్పిందే ఈవిడ చూసిందా అని వెక్కిరించేవారు లేరా? అక్కయ్య మంచి మనసుతో చూసింది కాబట్టే, మన అమ్మా యి మంచి గుణం కనిపించింది.

"ఇందులో నీ పాత్ర చెప్పవేం బావా?" మధ్యలో అందుకున్నడు వెంకటాచలం,

"నాదేముంది బావా, ఏ తండ్రైనా కూతురు క్షేమంగా ఉండాలనే ఏదైనా చేస్తాడు. అందరిలాగే నేను, పిల్లల బాధ్యత తల్లితండ్రులదేగా. కాని, పిల్లలు పెద్దల పట్ల తమ బాధ్యతను గుర్తెరిగే దెంత మంది? 'శైలు' అది గుర్తుంచుకున్నందు కు, ముఖ్యంగా చిన్నప్పటి నుంచి అమెరికాలో చదువుకున్నా, పుట్టిన సంస్కృతిని నరనరాన జీర్ణించుకున్నందు కు..." ఇక మాట్లాడలేకపోయాడు నాగభూషణం, దుఃఖం పొంగుకురాగా. కళ్లు తుడుచుకుంటూ మళ్లీ తనే అన్నాడు.

"కోడలు అత్తామామలకు సేవ చేయడం కాదు బావా! ఆ కోడల్ని కూతురిలాగా చూసుకునే అత్తామామలు కావాలి. ఈ విషయంలో మా అంత అదృష్టవంతులు చాలా అరుదు బావా! ప్రేమంటే ఏమిటో నా కూతురు చూపిస్తే, ఆ ప్రేమను ప్రేమతో రిసీవ్ చేసుకుంటే దక్కే ఫలితం ఎంత మధురమో అక్కయ్య చూపించింది. ప్రసూనా! అదే నీకు చెప్పాను నీ చెవి కెక్కలేదు."

"చూశావా అన్నయ్యా, ఈయన కెప్పుడు నా మీదే ఏడుపు" అన్నయ్యకి పిర్యాదు చేసింది చెల్లెలు ప్రసూన, గోముగా అన్నయ్య వొళ్లో తల వాల్చుతూ.

ఆప్యాయంగా నిమిరాడు చెల్లెలి తలపై చెయ్యి వేసి వెంకటాచలం, తమ చిన్ననాటి తలపులు గుర్తుకు రాగా. ■

**కథల పోటీ ఫలితాలు**
**త్వరలో... త్వరలో...**

'కథాసరిత్సాగరమథనం' పేరుతో ఎ.వి.కె.ఎఫ్. (అమెరికా)-ఆదివారం ఆంధ్రప్రభ సంయుక్తంగా నిర్వహించిన దీపావళి కథల పోటీకి విశేషమైన అనూహ్యస్పందన లభించింది. కలం పట్టండి! కథ వ్రాయండి! అంటూ ఇచ్చిన పిలుపుకు కథారచయితలు ఉత్సాహంగా స్పందించారు. కథల సంఖ్య ఎక్కువగా ఉండడాన, కథల పరిశీలనలో ఒకింత జాప్యం తప్పలేదు. ప్రసిద్ధకథకులతో కూడిన న్యాయనిర్ణేతల బృందం, కథలను పరిశీలిస్తోంది. ఈ దృష్ట్యా పోటీ ఫలితాలు తరువాయి సంచికలో ప్రచురితం అవుతాయి. బహుమతి ప్రదానోత్సవసభ వివరాలను కూడా అదే సంచికలో అందించడం జరుగుతుంది.

-ఎడిటర్